ఉరుమడ్లలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు

ప్రముఖుల నుంచి సమగ్ర సర్వే వివరాల సేకరణ

చిట్యాల, నవంబర్ 21 : ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే ఎన్యూమరేటర్లు గురువారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నుంచి వివరాలు సేకరించారు. మండలంలోని ఉరుమడ్లలోని ఆయన ఇంటికి వెళ్లిన సిబ్బంది గుత్తా నుంచి వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేస్తున్న అధికారులకు ప్రజలు సమాచారం అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నార్మాక్స్ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కంచర్ల నుంచి..

నీలగిరి : నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నుంచి ఎన్యూమరేటర్లు వివరాలు సేకరించారు. తన కుటుంబ సభ్యుల వివరాలను మాజీ ఎమ్మెల్యే ఎన్యూమరేటర్లకు అందించారు. సర్వే పట్ల ప్రజల నుంచి వస్తున్న స్పందనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

వరి కొయ్యలను భూమిలో కలియదున్నాలి : డీఏఓ

చిట్యాల, నవంబర్ 21 : వరి కోసిన తరువాత రైతులు వరి కొయ్యలను తగుల బెట్టవద్దని, వాటిని భూమిలో కలియ దున్నాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ సూచించారు. గురువారం మంలంలోని గుండ్రాంపల్లి పీఏసీఎస్‌ను ఆయన సందర్శించారు. స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం సుంకెనపల్లి గ్రామంలో గంగాపురం ఊషయ్య వరి పొలాన్ని పరిశీలించారు. వరి కొయ్యలను కాల్చితే భూసారం దెబ్బతింటుందని, మిత్ర పురుగులు, వానపాములు చనిపోతాయని వివరించారు. ఆయన వెంట ఏఓ గిరిబాబు ఉన్నారు.

రైతు కోసిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న డీఏఓ

ఎంజీయూ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

రామగిరి, నవంబర్ 21: ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే యూనివర్సిటీ మహిళా జట్టు ఎంపిక పోటీలు గురువారం వర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని కళాశాలల విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ హరీశ్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 27 నుంచి డిసెంబర్ 2 వరకు బెంగళూర్‌లోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఎంజీయూ తరపున పాల్గొననున్నట్లు తెలిపారు. బ్యాడ్మింటన్ కోచ్ ప్రకాశ్‌నారాయణ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్లు వై.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మురళి, పీడీలు పాల్గొన్నారు.

ఎంజీయూ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యం

- జేవీవీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి

రామగిరి, నవంబర్ 21: విద్యార్థుల్లోని సైన్స్ రిజ్ఞానాన్ని వెలికి తీసేందుకే జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నదని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి నన్నూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 40వేల మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, జేవీవీ జిల్లా బాధ్యులు రాఫెల్, బైరు గౌతమ్, రవీందర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

పోలీస్‌స్టేషన్ తనిఖీ

మాడ్గులపల్లి, నవంబర్ 21:మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ కృష్ణయ్య, సిబ్బంది ఉన్నారు.

ప్రకటన

నా క్లయింటు అయిన నాంపల్లి కళావతి, భర్త అంజయ్య, వయసు.39 సం. నివాసం, గాంధీ నగర్, నల్లగొండ టౌన్ & జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా నేను కొనుగోలు చేసినటువంటి ఇంటి యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం.8747/2023, మేము కొనుగోలు చేసినవారు శీలా ధర్మవతి భర్త భద్రయ్య నివాసం, గాంధీనగర్, నల్లగొండ టౌన్-జిల్లా గారి యొక్క దస్తావేజు నెం.6655/2015, Dated:20-06-2015, SRO-Nalgonda, ద్వారా సంక్రమించినవి. ఇట్టి లింకు దస్తావేజు ఇంటి నుండి షాప్‌కి వెలుచుండగా మార్గమధ్యములో పోయినది. ఇట్టి విషయమై నల్లగొండ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు నమోదు చేసినారు సదరు ఆస్తి యొక్క వివరములు ఇంటి నం.6-3-405, (Old No.6-3-94/M4/1), విస్తీర్ణం 16.42 చదరపు గజములు=13.72 చదరపు మీటర్లు గాంధీనగర్, రామగిరి, నల్లగొండ టౌన్&జిల్లా సదరు ఆస్తి యొక్క హద్దులు ఉత్తరం:యం.సత్యనారాయణ ఇల్లు/షాప్, దక్షిణం:30'.00 వైడ్ రోడ్డు, తూర్పు:30'.00 వైడ్ రోడ్డు, పడమర: అంజయ్య ఇల్లు, ఎవ్వరికైనను పై దస్తావేజులు దొరికినచో నా క్లైంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరములున్నచో తగిన ఆధారములతో (7) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

సం/- **నాంపల్లి చంద్రశేఖర్**
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ-508001, తెలంగాణ,
సెల్: 9440422393
నల్లగొండ
తేది:20-11-2024

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

మెమో పోయినది
దేవులపల్లి శైలజ, D/o. కృష్ణ, గ్రామం వాయిల సింగారం అనంతగిరి మండలం సూర్యాపేట జిల్లా అను పేరుగల SSC మెమో వాయల సింగారం నుండి అనంతగిరి మీదుగా కోదాడ వెళుతుండగా పోయినది. దొరికినవారు సంప్రదించగలరు.
9010253259

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్,నవంబర్ 21 : హాకీ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో బాలుర విభాగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో తృతీయ స్థానంలో నిలువడంతో పాటు జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి విష్ణుమూర్తి గౌడ్, ఎస్‌జీఏఫ్ కార్యదర్శి దగ్గుపాటి విమల, హాకీ అసోసియేషన్ కార్యదర్శి కరీం, వాడపల్లి రవీందర్, గుండా శ్రీనివాస్, కవిత, గఫార్, అలీమ్ పాల్గొన్నారు.

నీలగిరి : ప్రజాపాలన విజయోత్సవాల నిర్వహణకు జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాలలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం తన చాంబర్‌లో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ర్యాగింగ్ నిరోధానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

హాలియా : మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

క్రీడాపోటీలు అభినందనీయం

నల్లగొండ రూరల్ : గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఈశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లా కేంద్రంలో గ్రామోత్సవం పేరుతో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం తన చాంబర్‌లో గ్రామోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ వారిని ఆమె అభినందించారు. గ్రామోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ చరణ్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు మేకల అభినవ్ స్టేడియంలో పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈశ ఫౌండేషన్ వలంటీర్లు మాలతి, మాధవి, ప్రణవ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

హాలియా : ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. హాలియా మున్సిపాలిటీలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి క్యాంటీన్‌ను గురువారం ఆమె స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమానరేందర్‌రెడ్డి, డ్వామా పీడీ శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

రామగిరి, నవంబర్ 20: ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు చేపట్టిన నిరవధిక బంద్ గురువారం రెండోరోజు కొనసాగింది. కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు కళాశాలలను మూసి వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాలల అసోసియేషన్ ఎంజీయూ అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సమస్య పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం గత నెలలో తమకు ఇచ్చిన హామీని అమలు చేయాలని, పెండింగ్ ఫీజులు చెల్లించి ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.

బెల్లం, పటిక తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

మిర్యాలగూడ, నవంబర్ 21: నాటుసారాకు ఉపయోగించే బెల్లం, పటికను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎల్.మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మాడ్గులపల్లి టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించగా దామరచర్ల మండలం ఇర్కిగూడెం గ్రామానికి చెందిన డేగల రమేశ్, లోట్లపల్లి మహేశ్ అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటోలో 944కిలోల బెల్లం, 120 కిలోల పటికను తరలిస్తూ పట్టుబడ్డారు. దాంతో వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు ఎస్‌కే.పర్వీన్, వై.లావణ్య, రాఘవేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

కేతేపల్లి, నవంబర్ 21 : మండలంలోని భీమారం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు గ్రామానికి చెందిన రేఖా ఫౌండేషన్ సభ్యులు అందించిన క్రీడా దుస్తులను గురువారం ప్రధానోపాధ్యాయుడు కె.భిక్షమయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

మిర్యాలగూడ,నవంబర్ 21 : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గురువారం పట్టణంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. జ్యోతిబాపూలే భవనంలో సంఘం జెండాను ముదిరాజ్ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి అవదారపు మురళి, ముదిరాజ్ మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోల సైదులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బంటు సైదులు, దాసరాజు జయరాజు, బంటు దుర్గయ్య, లింగయ్య, కోల నాగరాజు, నల్లమేకల వెంకయ్య, బంటు రమేశ్, తవిటి సైదులు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మిర్యాలగూడలో జెండావిష్కరిస్తున్న నాయకులు

మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పడాలి

నల్లగొండ రూరల్ : మత్స్య సంపదను పెంచి మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్న కోరారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని గురువారం నల్లగొండలోని సంఘం భవనంలో నిర్వహించారు. సంఘం గౌరవ సలహాదారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి సత్తయ్య, మునాస్ వెంకన్న, కిషన్, వెంకటయ్య, గడిగ శ్రీను, గుండు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, కృష్ణయ్య, శంకర్, శివకుమార్ పాల్గొన్నారు.

- హాలియా : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గురువారం హాలియాలో సంఘం జెండాను ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిడిగం నాగయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు యలకాని వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు దుర్గారావు, వెంకటేశ్వర్లు, లింగంపల్లి శ్రీనివాస్, సైదులు, మంగయ్య పాల్గొన్నారు.

దర్గా ముతవల్లీ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చందంపేట(దేవరకొండ), నవంబర్ 21 : దేవరకొండ పట్టణంలోని చిన్న దర్గా ముతవల్లీ సయ్యద్ ఏజాస్ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి ఏజాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు మహ్మద్ ఖాదర్‌బాబా, అఫ్రోజ్, తులసీరాం, మహ్మద్ బాబా, ఇలియాస్ ఉన్నారు.

'మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి'

నీలగిరి, నవంబర్21. ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్లో జరిగే మాల ఉద్యోగుల అత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో మాల ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. నాయకులు ఎన్నమల్ల అనిల్, చింతపల్లి బాలకృష్ణ, అద్దంకి రవీందర్, అనిమల్ డిండి ప్రసాద్, సంద యాదగిరి, నామ చక్రవర్తి, అంగరాజు స్వర్ణలత, ముసుకు పృథ్వీ ఉన్నారు.

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

- ఎంపీ రఘువీర్‌రెడ్డి

మిర్యాలగూడ, నవంబర్ 21: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐదు డయాలసిస్ మిషన్లను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు సౌకర్యాలను కల్పించేందుకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. మిర్యాలగూడలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న డయాలసిస్ మిషన్లు సరిపోకపోవడంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరో ఐదు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి : ఆర్డీఓ

కట్టంగూర్/నీలగిరి, నవంబర్ 21 : సమగ్ర కుటుంబ సర్వే వివరాల డేటాను పక్కాగా నమోదు చేయాలని నల్లగొండ ఆర్డీఓ యారాల అశోక్‌రెడ్డి సూచించారు. గురువారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో, కట్టంగూర్ మండల పరిషత్ కార్యాలయం నిర్వహించిన డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణలో ఆయన మాట్లాడారు. డేటా ఎంట్రీని పది రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. వివరాలను లీక్ చేయవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, కట్టంగూర్ ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, తాసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీఓ చింతమల్ల చలపతి, ఎంఈఓ అంబటి అంజయ్య, ఎంపీఎస్‌ఓ శ్రీనివాస్, డీటీ సుకన్య పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

- మునుగోడు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చండూరు ఆర్డీఓ శ్రీదేవి కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ తీరుపై కౌన్సిలర్ల నిరసన

మిర్యాలగూడటౌన్, నవంబర్ 21: మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ భార్గవ్ తీరు సరిగా లేదంటూ కౌన్సిలర్లు నిరసన తెలిపారు. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశాన్ని కాంగ్రెస్ కౌన్సిలర్లు బహిష్కరించి కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ భార్గవ్ 15 సంవత్సరాలుగా మున్సిపల్ ఖజానాను దోచుకొని అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. పట్టణంలో అక్రమ కట్టడాలకు అనుమతులిచ్చి, కమీషన్లు దండుకొని ప్రస్తుతం ఏమీ తెలియనట్లు ప్రభుత్వ కట్టడాలు, అనధికార కట్టడాలపై వివరణ ఇవ్వాలని ఆర్‌టీఐకు లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి అవినీతిపరులను కాంగ్రెస్ పార్టీలోకి రానివ్వమంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

విద్యార్థులను కొడితే చర్యలు తీసుకుంటాం

- తాసీల్దార్ ప్రమీల

త్రిపురారం, నవంబర్ 21 : విద్యార్థులను కొట్టినా, తిట్టినా కఠిన చర్యలు తప్పవని తాసీల్దార్ గాజుల ప్రమీల హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ఈ నెల 13న మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు హోం వర్క్ చేయలేదని, షూస్ వేసుకురాలేదని, అల్లరి చేస్తున్నారనే నెపంతో ఉపాధ్యాయులు తీవ్రంగా కొట్టడంతో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు తాసీల్దార్‌తో పాటు ఎస్‌ఐ వై. ప్రసాద్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని వారు తెలిపారు.

పాఠశాలలో విచారణ చేపడుతున్న తాసీల్దార్ ప్రమీల, ఎస్‌ఐ ప్రసాద్

హైకోర్టు తీర్పుపై పెన్షనర్ల హర్షం

నకిరేకల్, నవంబర్ 21 : 2010 తరువాత రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి పెన్షన్ చెల్లించాలని రాష్ట్ర హైకోర్టు తీర్పునివ్వడంపై రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. గురువారం నకిరేకల్‌లోని సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల కమిషన్ రికవరీపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ 11 సంవత్సరాల మూడు నెలలు రికవరీ అయిన పెన్షనర్స్‌కు మ్యూటేషన్ రికవరీ నిలుపుదల చేసి వారికి పూర్తి పెన్షన్ చెల్లించాలని హైకోర్టు తీర్పునిచ్చిందని చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బాదిని లింగయ్య, నకిరేకల్ యూనిట్ అధ్యక్షుడు వంటల రామలింగం, ప్రధాన కార్యదర్శి కందుల సోమయ్య, కోశాధికారి భిక్షంరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి : జేఏసీ

తిప్పర్తి, నవంబర్ 21: జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఈ నెల 23న నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ చైర్మన్ కత్తుల జగన్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనానికి ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కత్తుల తులసీదాస్, నాగుల నర్సింహ, కందుల లక్ష్మయ్య, కొమ్ముగిరి, ఊదరి నవీన్, కిన్నెర అంజి పాల్గొన్నారు.

కాల్వ నిర్మాణాన్ని నిలిపివేయాలని వినతి

నార్కట్‌పల్లి, నవంబర్ 21: మండల కేంద్రంలోని మసీదు వెనుక భాగంలో మాంద్ర రోడ్డు వెంట నిర్మిస్తున్న మురుగు కాల్వ వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, సదరు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం వారు ఈ మేరకు ఎంపీడీఓ, గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. గత మోరీ స్థానంలోనే కొత్తది నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేడబోయిన శ్రీనివాస్, నోముల నాగరాజు, కన్నెబోయిన నర్సింహ, నడింపల్లి శ్రవణ్, మునుకుంట్ల గణేశ్, పాలకూరి రమేశ్, వడ్డెగోని రామలింగం, అనంతుల నాగరాజు, అంజి పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, నవంబర్ 21 : టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని గురువారం చిట్యాలలో జరిగిన సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏశమల్ల నాగయ్య, ఉపాధ్యక్షులుగా రంగా రామలింగయ్య, ఎం. జానకి, ప్రధాన కార్యదర్శిగా గడగోజు సతీశ్, కోశాధికారిగా తోట చంద్రశేఖర్, కార్యదర్శులుగా డి.శ్రీరాములు, ఎన్. శ్రీధర్, బి.రామ్మోహన్, పి.శ్రీరాములు, ఆర్. రఘు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

-హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్

త్రిపురారం, నవంబర్ 21: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గిరిజనులు వినియోగించుకోవాలని హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ కోరారు. గురువారం మండలంలోని మాటూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ సుధీర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పరంధాములు, రజియా సుల్తానా పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చిట్యాల, నవంబర్ 21 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిట్యాలకు చెందిన సంగిశెట్టి భాస్కర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి బాల్య మిత్రులు (1992 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు) గురువారం భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.64,500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాలిశెట్టి రాజు, తోకల జంగారెడ్డి, నక్కల విజయసారధి, జాల వెంకటేశ్, ముజీబ్, తుక్కాని వెంకట్‌రెడ్డి, గంటెపాక శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

శాలిగౌరారం, నవంబర్ 21 : మండలంలోని బైరవునిబండ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మణికొండ రవి తండ్రి యాదయ్య ఇటీవల మృతి చెందాడు. గ్రామ మాజీ ఎంపీటీసీ కొత్త శంకర్‌రెడ్డి గురువారం వారి ఇంటికి వెళ్లి యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకకులు పులిగిళ్ల శంకరయ్య, కడారి మల్లయ్య, చింతయ్య, రంజిత్, గణేశ్, మనోజ్, కరుణాకర్ ఉన్నారు.

- తిరుమలగిరి(సాగర్) : మండల కేంద్రానికి చెందిన ముత్తయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త పగడాల సైదులుయాదవ్ గురువారం ఆస్పత్రికి వెళ్లి ముత్తయ్యను పరామర్శించారు. చికిత్స నిమిత్తం రూ.30వేల ఆర్థిక సాయం అందించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ

త్రిపురారం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఆన్‌లైన్ ప్రక్రియపై కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించారు. జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి వారికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ విజయకుమారి, ఏఈ వెంకట్‌రెడ్డి, ఎంఈఓ రవినాయక్, ఏఎస్‌ఓ దీప పాల్గొన్నారు.

- చందంపేట : మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తాసీల్దార్ శ్రీనివాస్ పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి, ఇరిగేషన్ ఏఈ రాధ, డీటీ గోవర్ధన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆలగడపలో పశువైద్య శిబిరం

మిర్యాలగూడ రూరల్ : మండల పశువైద్యాధికారి నాయిని దుర్గారమాదేవి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఆలగడప గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 62 బర్రెలకు చికిత్స అందించారు. దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో పశువైద్యుడు జ్ఞానేశ్వర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దవూర, నవంబర్ 21: మండలంలోని వెల్మగూడెం, పెద్దవూర సబ్‌స్టేషన్లలో మెయింటెన్స్ వర్క్ జరుగుతున్నందున శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దాసయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్మగూడెం, బసిరెడ్డిపల్లి, గర్నెకుంట, కటికర్లగూడెం, పెద్దగూడెం, చిన్నగూడెం, సిరసనగండ్ల గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, పెద్దవూర, బట్టుగూడెం, కొత్తగూడెం, ముసలమ్మచెట్టు, పోతునూరు, పీఎం సంగారం, పిన్నవూర, సంగారం, ఎర్రకుంటతండా, ఈదులగూడెం, చింతపల్లి, చింతపల్లితండా, తెప్పలమడుగు, తుంగతుర్తి, లింగంపల్లి, నాయనివానికుంటతండా గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మర్రిగూడ, నవంబర్ 21 : మండలంలోని తిరుగండ్లపల్లి శివారులోని ఇప్పబండ మూలమలుపు వద్ద బుధవారం రాత్రి బైక్ అదుపుతప్పి కింద పడడంతో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన గ్యార నర్సింహ(27), ఏర్పుల శివ హైదరాబాద్ నుంచి తిరుగండ్లపల్లిలోని బంధువుల ఇంటికి బైక్‌పై బయల్దేరారు. అతివేగంగా వెళ్తున్న బైక్ మండలంలోని తిరుగండ్లపల్లి శివారులో అదుపుతప్పి రోడ్డుపక్కన గల చెట్లపొదల్లో పడిపోయింది. నర్సింహ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శివకు కూడా గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అంజయ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

మిర్యాలగూడ, నవంబర్ 21: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఒక వ్యక్తి ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై కారు పార్క్ చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తుండడంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ సుధీర్ అందించిన సమాచారంతో ట్రాఫిక్ ఎస్‌ఐ కారును స్టేషన్‌కు తరలించారు. సదరు వ్యక్తిని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారన అయ్యింది. సదరు వ్యక్తి తన వివరాలు పోలీసులకు తెలుపకుండా దుర్భాషలాడుతూ వారిపై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించాడు. దాంతో సదరు వ్యక్తిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం జిల్లా కార్యదర్శి మురారి మోహన్

కట్టంగూర్, నవంబర్ 21 : ప్రభుత్వం మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురారి మోహన్ డిమాండ్ చేశారు. మత్స్యరంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మండలంలోని ఈదులూరు గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మత్స్యకారులకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ జిల్లా డైరెక్టర్ తవిడబోయిన అజయ్‌కుమార్, నాయకులు గుడిసె రమేశ్, తవిటి నాగార్జున, నార్ల యాదయ్య, తవిడబోయిన సత్యనారాయణ, తిరుమలేశ్ పాల్గొన్నారు.

పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటో సీజ్

కొండమల్లేపల్లి, నవంబర్ 21 : పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకొని ప్రయాణిస్తున్న ఆటోను గురువారం సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. మండంలోని పెండ్లిపాకల నుంచి చింతపల్లికు ఆటోలో 20 మంది పత్తి కూలీలను ఎక్కించుకొని అజాగ్రత్తగా నడుపుతున్న ఆటోను గుర్తించి సీజ్ చేశామని, ఆటో డ్రైవర్ హనుమంతుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రైతులకు రుణాలందించాలని కలెక్టర్‌కు వినతి

చందంపేట, నవంబర్ 21 : మండలంలోని అచ్చంపేట పట్టి గ్రామానికి చెందిన రైతులకు రుణాలు అందించాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, గిరిజన సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి వినతిపత్రం అందించినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన లావుని పట్టా భూమి వివరాలు ధరణిలో నమోదై ఉన్నప్పటికీ బ్యాంక్ అధికారులు వ్యవసాయ రుణాలు మంజూరు చేయడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు, జరిమానా

మాల్, నవంబర్ 21: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు రూ.2వేల జరిమానా, ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ బి.యాదయ్య తెలిపారు. ముదిగొండ గ్రామానికి చెందిన రాత్లావత్ రాములు మద్యం తాగి బైక్‌పై వస్తుండగా చింతపల్లిలో వాహనాల తనిఖీలో పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దేవరకొండ కోర్టులో హాజరు పర్చగా విచారించిన స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పొట్ట చెన్నయ్య నిందితునికి జరిమానా, జైలు శిక్ష ఖరారు చేసినట్లు పేర్కొన్నారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో మొబైల్ గుర్తింపు

పెద్దవూర, నవంబర్ 21: పోగొట్టుకున్న మొబైల్స్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో ట్రాక్ చేసి రికవరీ చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. మండలంలోని బాసోనిబావితండాకు చెందిన రమావత్ శోభన్‌బాబు మొబైల్ పోగొట్టుకోగా అతడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ టెక్నాలజీతో గుర్తించి గురువారం అందించారు.